క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

మజ్జిగ సీసాలు పంపిణీ




తెనాలిఅర్బన్: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టౌన్ చర్చి వద్ద శుక్రవారం మధ్యాహ్నం 1500 మజ్జిగ సీసాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు దేవరపల్లి టైటస్ మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తమసంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ సీసాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య



కొల్లిపర: బాకీదారులు డబ్బులు అడగడంతో పాటు దౌర్జన్యం చేయడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపరకి చెందిన ఆయోధ్య శివరామకృష్ణ (28) ఆదే గ్రామానికి చెందిన లింగాల శివరామకృష్ణ, కొల్లిపర శేషులకు బాకీ ఉన్నాడు. దీంతో ఇద్దరు డబ్బులు అడగటంతో పాటు కలసి కొట్టడంతో ఆయోధ్య శివరామకృష్ణ మనస్తాపానికి గురయ్యాడు. దీంతో గురువారం రాత్రి తన గృహంలో తాటిదూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు తలుపు తీయగా శివరామకృష్ణ ఉరివేసుకుని కనిపించటంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివరామకృష్ణ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవాని పాలెం: మండలంలోని చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బండ్లమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నేడు గుండె వ్యాధులపై అవగాహన సదస్సు

రేపల్లె రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 8 గంటలకు గుండెకు సంబంధించిన వ్యాధులపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వివిధ వైద్యశాలల వైద్యులకు సదస్సు నిర్వహించనున్నట్లు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె జబ్బులపై డాక్టర్ నాగశ్రీ హరిత, పిల్లల గుండె జబ్బుల ఆపరేషన్‌పై డాక్టర్ భరత్ సిద్ధార్థ, పిల్లల్లో మూర్ఛవాధి, మందుల వినియోగంపై డాక్టర్ హరిణి వివరిస్తారని, సదస్సులో వైద్యులు పాల్గొనాలని పేర్కొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

కొల్లూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని కొల్లూరు పోలీసులు అరెస్టు చేసిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పెసర్లంకకు చెందిన శొంఠి కర్ణుడు మద్యం దుకాణాల్లో.. మద్యం సీసాలు కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ రవీంద్రరెడ్డి తన సిబ్బందితో అతని దుకాణంలో సోదాలు జరిపారు. 20 మద్యం సీసాలు దుకాణంలో లభ్యమవడంతో అతనిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. నిందితుడిని తెనాలి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే మనందరి లక్ష్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- కొల్లిపర మండల నేతలతో భేటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ఇంటింటికీ గుర్తుచేస్తూ రానున్న ఎన్నికల్లో మరోసారి విజయానికి కృషిచేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. ఎన్నికలు ముగిసేవరకు ప్రజలతోనే ఉండాలని, వారి మద్దతును కూడగట్టాలని చెప్పారు. కొల్లిపర మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, అత్తలూరివారిపాలెం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో గురువారం రాత్రి స్థానిక ఏఎస్ఎన్ మహిళా ఇంజినీరింగ్ కాలేజి ఆవరణలో సమావేశమయ్యారు. ముందుగా ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిస్థితుల గురించి వాకబు చేశారు.

పార్టీ బలాబలాలు, మెరుగుపడేందుకు తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చినపుడే ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయని గుర్తుచేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్ని హామీలిచ్చినా, ఎన్నికలయ్యాక వాటిని పట్టించుకోరని గుర్తుచేశారు. వలంటీర్ల వ్యవస్థను తొలగిస్తారని వాటి స్థానంలో మళ్లీ జన్మభూమి కమిటీలు రంగప్రవేశం చేస్తాయని చెప్పారు. అవినీతి లేకుండా పారదర్శకంగా ఇప్పటిలా ప్రభుత్వ పథకాలు అందే అవకాశం ఉండదన్నారు. ప్రతిపక్ష పార్టీలు తామేం చేసేది చెప్పకుండా కేవలం జగన్‌పైనా, ప్రభుత్వంపైనా బురద జల్లుతూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయని శివకుమార్ ఆరోపించారు. ఈ వాస్తవాలన్నింటినీ ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

అల్లా దయ అందరికీ ఉండాలి

ఎమ్మెల్యే శివకుమార్



14వ వార్డులో అక్సా మసీదులో దువా (ప్రార్థన)లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ముస్లింలందరూ ఎంతో పవిత్రంగా విశ్వాసంతో రంజాన్‌మాసంలో అల్లాకు దువా(ప్రార్థన) చేస్తారని అల్లా దయ వల్ల సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆకాంక్షించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని 14వ వార్డులో అక్సా మసీదులో శుక్రవారం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌మాసంలో ఉపవాసంతో అల్లాను అందరూ ప్రార్థిస్తారని చెప్పారు. అల్లా దయ రాష్ట్ర పాలకులపై ఉండే విధంగా ప్రార్థించాలని కోరారు. అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, షేక్ ఇస్మాయేల్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గోల్డ్ రెహమా, టోపీ సుభానీ, షేక్ మీరావలి, పఠాన్ సుభానీ, అల్లాభక్షు, గౌస్, సుభానీ, మస్తాన్, గ్యాస్ సుభానీ, తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల్లో నగదు పట్టివేత

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడుతోంది. మండలంలోని సంగంజాగర్లమూడి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో గురువారం రాత్రి ఓ కారులో రూ. రెండు లక్షల నగదును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలానే జేఎంజే కళాశాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శుక్రవారం త్రీ టౌన్ పోలీసుల తనిఖీల్లో రూ. 3.50 లక్షలను పోలీసులు గుర్తించి స్వాధీన పర్చుకున్నారు.

ఏసుక్రీస్తు శిలువ త్యాగంతో లభించిన రక్షణ

- ఎమ్మెల్యే శివకుమార్
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా తెనాలి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు



నాటకంలో భాగంగా శిలువను మోస్తున్న భక్తుడు



కొలకలూరులో ఆర్‌సీఎం చర్చి ఆవరణలో శిలువను మోస్తున్న యువతి

తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు శిలువ త్యాగం వలన మనుష్యులకు రక్షణ లభించిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా చెంచుపేటలోని బైబిల్ మిషన్ చర్చిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మనుష్య కుమారుడుగా భూలోకానికి వచ్చారని తెలిపారు. ఆయన ప్రజల పాపాల నుంచి విముక్తిని ఇచ్చేందుకు శిలువలో మరణించారని గుర్తు చేశారు. ఆయన త్యాగాలను అందరూ స్మరించుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఆయన బాటలో అందరూ నడవాలని సూచించారు. అనంతరం ఆయనకు చర్చి నిర్వాహకులు పాస్టర్ అహరోను, సంఘ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని బోసురోడ్డులోని క్రీస్తు లూథరన్ చర్చి (టౌన్‌చర్చి)లో శుక్రవారం ప్రార్థనలు జరిగాయి. ఏసుక్రీస్తు శిలువ వేసే సమయంలో పలికిన ఏడు మాటలను పాస్టర్లు రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం, రెవరెండ్ యామర్తి లెనిన్ బాబు, రెవరెండ్ దగ్గుమల్లి సల్మాన్‌రాజు, రెవరెండ్ ప్రకాష్‌బాబులు వివరించారు. కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.
- ఐతానగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ప్రత్యేక ఆరాధనను నిర్వహించారు. మేజర్ పి.నాగరాజు, పి.రత్నసుందరీలు క్రీస్తు శిలువ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యూత్‌సభ్యులు పాల్గొన్నారు.
- నందివెలుగులోని ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలో గుడ్‌ఫ్రైడే ఆరాధనలు నిర్వహించారు. రెవరెండ్ ఎ.భానుప్రసాద్ శిలువలో పలికిన ఏడు మాటలను వివరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.
- చెంచుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో పవిత్ర శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ కోయ స్లీవ, ఫాదర్ విజయకుమార్, ఫాదర్ విన్సెంట్‌లు ఏసుక్రీస్తు శిలువ ఘట్టాలకు సంబంధించి అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే
చర్చిలో ఉపవాస ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

తెనాలిటౌన్: మండల గ్రామాల్లోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే (శుభ శుక్రవారం) వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలలో ఉదయం 11 గంటల నుంచి ఉపవాస ప్రార్థనలు జరిపారు. వివిధ చర్చిలలో శిలువ మార్గము కార్యక్రమాన్ని నిర్వహించారు. కొలకలూరులోని ఆర్‌సీఎం చర్చిలో శిలువ మార్గంలో భాగంగా ఫాదర్ సాగర్ థామస్, యువతీ యువకులు శిలువను మోశారు. శిలువపై క్రీస్తు పలికిన మాటలను తెలియజేశారు. 14 స్థలాల్లో క్రీస్తు పడిన శ్రమలను గురించి ధ్యానించారు. శిలువ మోస్తూ చర్చి చుట్టూ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉపదేశి కె.క్రీస్తురాజు, జూబ్లీ స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ లీమా, స్కూల్ సిస్టర్స్, సంఘ పెద్దలు, మహిళలు, యువతీ, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. చావావారిపాలెంలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ శౌరిరాజు ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమం నిర్వహించారు. ఫాదర్, యువకులు శిలువను మోశారు. కార్యక్రమంలో ఫాదర్ ఇమ్మానుయేలు, ఫాదర్ మోరియా, ఫాదర్ చరణ్, హోలీ సిస్టర్స్, సంఘస్తులు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. పట్టణ ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనాకొండ చర్చిలో శుభశుక్రవారం ఆరాధన సంఘ కాపరి బ్రదర్ ఆనందన్న ఆధ్వర్యంలో జరిగాయి. ఏసుక్రీస్తు శిలువపై పలికిన మాటలను తెలియజేశారు. రూరల్ మండలంలోని లూథరన్ చర్చి, ఆర్‌సిఎం, తెలుగు బాప్టిస్టు చర్చిలలో భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు జరిపారు.



టౌన్ చర్చిలో వాక్యపరిచర్య చేస్తున్న పాస్టర్ ఏసురత్నం



చెంచుపేట చర్చిలో ఎమ్మెల్యే శివకుమార్‌కు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ అహరోను



సాల్వేషన్ ఆర్మీ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న మేజర్ నాగరాజు, రత్నసుందరీ

వేర్వేరు ప్రాంతాల్లో....

తెనాలిరూరల్: క్రైస్తవులు పవిత్రంగా భావించే గుడ్‌ఫ్రైడే(మహా శుక్రవారం)ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మానవాళి పాపాల కోసం ఏసుక్రీస్తు చేసిన ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రత్యే ఆరాధనలు నిర్వహించారు. మారీసుపేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో సంఘ కాపరి, తెనాలి యునైటెడ్ పాస్టర్స్ అండ్ గాస్పెల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ పినపాటి జాన్‌పాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. సంఘ సభ్యులు సింధు, షకీల, సుజని, కిరణ్మయి, రత్నకుమారి, సరిత, సుభాషిణి ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను వివరించారు. సంఘ పెద్దలు పినపాటి డేవిడ్‌రాజు, ఈవూరి శ్రీనివాసరావు, దానియేలు, ఏసురత్నం, కసుకుర్తి భాస్కరరావు, జయరాజు ఆరాధనను పర్యవేక్షించారు. బిషప్ జాన్‌పాల్ పార్థనాశీర్వాదాలను అందించారు.

ఆకట్టుకున్న ఏసుకీస్తు శిలువ మార్గం నాటిక

తెనాలిఅర్బన్: గుడ్‌ఫ్రైడే పండుగను పురస్కరించుకుని తెనాలి చెంచుపేటలోని ఆర్‌సీఎం చర్చిలో ఏసుక్రీస్తు శిలువ మార్గం నాటికను శుక్రవారం సాయంత్రం ప్రదర్శించారు. ఏసుక్రీస్తు వేషధారణలో ఒక యువకుడు, భటుల వేషధారణలో మరికొందరూ నటించారు. క్రీస్తు శిలువ ఘట్టాన్ని కలకు కట్టినట్లు చూయించారు. ఏసుక్రీస్తును భటులు కొరడాలతో కొట్టి చిత్రహింసలు గురిచేయడం, ముళ్ళ కీరిటం పెట్టడం, చివరకు ఆయనను శిలువ వేయడం వంటి వాటిని ప్రదర్శించారు. నాటికను చూసేందుకు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు అక్కడకు వచ్చి ఏసుక్రీస్తును ఆరాధించారు.



చావావారిపాలెంలో శిలువను మోస్తున్న ఫాదర్



ఆర్‌సీఎం చర్చిలో వాక్యపరిచర్య చేస్తున్న ఫాదర్ స్లీవా



నందివెలుగు ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

క్రికెట్ క్రీడాకారులకు జెర్సీలు అందజేత



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన రాయల్ ఫైటర్స్ క్రికెట్ క్రీడాకారులకు దాతలు షేక్.అబ్దుల్ రఫీ, షేక్.నాగుల్ షరీఫ్ శుక్రవారం జెర్సీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.15వేల విలువైన జెర్సీలు అందజేసినట్లు తెలిపారు. క్రికెట్ పోటీల్లో పాల్గొని గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని అభినందించారు. కార్యక్రమంలో షేక్.పి. ఇమామ్ ఖాజావలి, షేక్. వి.మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ముగిసిన యువజనోత్సవాలు



తాడేపల్లిరూరల్ : విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాల్లో ఉన్న విజ్ఞానాన్ని చదివితే సరిపోదని, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలంటే నిబద్ధత, ఆత్మవిశ్వాసం, ఓర్పు, నిర్వహణ సామర్థ్యాలు, సంభాషణ నైపుణ్యాలు ఎంతో అవసరమని కేఎల్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో బీఏ ఐఏఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక యువజనోత్సవాలు (ఆత్రోబ్ 24) ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుష్ప్రవర్తనకు, దుష్ప్రచారాలకు దూరంగా మెలగుతూ, ప్రతి విషయంలోనూ సానుకూల దృక్పథాన్ని విద్యార్థులు పెంపొందించుకున్నప్పుడు లక్ష్యాన్ని సులభంగా చేరుకోగలుగుతారని అన్నారు. బీఏఐఏఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ పాలసీ, డిజిటల్ హ్యూమానిటీస్ అనే రెండు కొత్త కోర్సులను ప్రారంభించనున్నామని తెలిపారు. బీఏతో పాటుగా ఏంఏ కోర్సులు ఐఏఎస్ ఓరియన్‌టేషన్‌తో నిర్వహించనున్నామన్నారు. సివిల్ సర్వీసెస్, ప్రభుత్వ ఉద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కేఎల్‌యూతో పాటు వివిధ కళాశాలల నుంచి సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఈ సాహిత్య సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, స్పాట్ ఈవెంట్స్, శాస్త్రీయ, పాశ్చాత్య, లలిత సంగీతాలు, మిస్టర్ అండ్ మిసెస్ తదితర 14 అంశాల్లో పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఆచార్యులు డాక్టర్ కె.తాతారావు, విభాగ ఉప అధిపతి డాక్టర్ కె.అనిల్‌కుమార్, కార్యక్రమ కన్వీనర్లు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, డాక్టర్ బాలాజీ మానసారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికుమార్, విద్యార్థి కో–ఆర్డినేటర్లు స్వామి, అశోక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు సిద్ధంకండి



36వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు కోరారు. పట్టణంలోని 36వ వార్డులో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతిరెడ్డి హేమలత, ఏలూరి శేషగిరిరావు, కఠారి హరీష్, బ్రహ్మం, తాడిబోయిన నాగార్జున, పెద్ద సంఖ్యల వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ బీసీ సెల్ క్లస్టర్–2 అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పెదలంక వెంకటేశ్వర రావును వైఎస్సార్ సీపీ నాయకులు మేకల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మారీసుపేటలో ఘనంగా సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు అందరూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో 23, 24 వార్డుల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. –తెనాలిఅర్బన్

ఉమేష్‌చంద్రకు ఘన నివాళి



ఉమేష్ చంద్ర విగ్రహానికి సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ రమేష్, పోలీసు అధికారులు

తెనాలిరూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర 58వ జయంతిని శుక్రవారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. తెనాలి సబ్‌డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చెంచుపేటలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, ఉమేష్ చంద్ర బంధువులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. తెనాలి డీఎస్పీ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ అధికారులు, అభిమానులతో కలిసి ఉమేష్‌చంద్ర కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉమేష్‌చంద్ర సేవలు స్ఫూర్తిదాయకమైనవని, ఆయన త్యాగం చిరస్మరణీయమైందని పేర్కొన్నారు. ఉమేష్‌చంద్ర మనమధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాట్లాడుతూ ఉమేష్ చంద్ర దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. మన ప్రాంతానికే గర్వకారణమైన వ్యక్తి అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మంచి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు ఎస్.రమేష్‌బాబు, యం.దశరథ రామారావు, ఎస్సైలు, సిబ్బంది, ఉమేష్ చంద్ర కుటుంబ సభ్యులు జాస్తి భుజంగేశ్వరరావు, దేవాబక్తుని ఉమామహేశ్వరరావు, తాడిబోయిన శ్రీనివాసరావు, కంతేటి శ్రీరాజబాబు, అయినంపూడి కోటేశ్వరరావు, యడ్లపాటి వెంకటేశ్వర రావు, పాల్గొన్నారు.

వటపత్రసాయిగా నారసింహుడు



మంగళగిరి: నగరంలో వేంచేసి వున్న లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వటపత్రశాయి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన మేళ్లచెరువు సీతామహాలక్ష్మి వ్యవహరించారు.